


**సోదరీ సోదరులారా!**

**మన సమాజంలో అనేక మంది దయ్యాలు ఉన్నాయనీ, వాటిని తాము చూశామనీ, తమతో అవి మాట్లాడాయనీ, అవి కొంతమందిని చంపటం తమకు తెలుసుననీ అంటుంటారు. ఈ దయ్యాలు అనే భావన వాస్తవమా? లేక మూఢనమ్మకమా? ఈ విషయాన్ని గూర్చి సైన్సు ఏం నిరూపించింది? మానసిక శాస్త్ర వైద్యులు ఏమని నిరూపించారు? తెలుసుకుందాం.**

దయ్యాలను గూర్చి మానసిక శాస్త్ర వైద్యుల విశ్లేషణ ఏమిటంటే మనం అకస్మాత్తుగా తీవ్రమైన భయాందోళనలకు గురియైనప్పుడు, ఎదురుగా లేనివి కనబడినట్లు, ఎవరో మాట్లాడుతుంటే వినబడినట్లూ అనిపిస్తుంటుంది. వీటినే" Illusions" మరియు " Delusions" అంటారు. తెలుగులో 'భ్రమలు' మరియు 'భ్రాంతులు' అంటారు. భ్రమలు, భ్రాంతులున్న దశలోని మన అనుభూతులనే 'దయ్యాలను చూడటం, వాటి మాటలు అని ప్రజలు అనుకొంటుంటారు... ప్రజలు, ప్రతి మనిషికీ ఒక ఆత్మ ఉంటుందనీ, ఎవరైనా వయస్సులో ఉన్నప్పుడు హత్య ద్వారా గానీ, ఆత్మహత్య ద్వారాగానీ, మరే ఇతర కారణం చేతగానీ అకస్మాత్తుగా చనిపోతే, వారు కోరికలు తీరకుండానే చనిపోయినారు కాబట్టి, వారి ఆత్మలు, వారు చనిపోయిన ప్రదేశంలోనే దయ్యాల రూపంలో తిరుగుతుంటాయనీ, ఆ ప్రాంతానికి రాత్రిపూట పోయిన వారికి అవి కనిపిస్తాయనీ, వారితో మాట్లాడుతాయనీ, అవకాశం దొరికితే వారిని బాధిస్తాయనీ, మరీ దుర్మార్గమైన దయ్యాలయితే ప్రజలను చంపివేస్తాయనీ అనుకొంటున్నారు. కానీ, సైన్సు కార్యకర్తలు గానీ, మానసిక శాస్త్ర నిపుణులు గానీ, అలాంటి దయ్యాలపై పరిశోధన జరిపిన అన్ని సందర్భాలలోనూ, దయ్యాలు లేవనీ, అవన్నీ తీవ్రమైన భయాందోళనలకు గురియైన వారి భ్రమలు, భ్రాంతులేనని నిరూపించబడింది. అలాంటి పరిశోధనలకు సంబంధించిన కొన్ని సంఘటనలను మీకు వివరిస్తాం.

## సంఘటన1 :

ఇది 1977 నాటిమాట. ఆరోజుల్లో కాంతారావు మాస్టరు అనే సైన్సు కార్యకర్త ప్రకాశం జిల్లా రావినూతల అనే గ్రామంలో "విశ్వశాంతి విద్యాకేంద్రం" నడుపుతూ, 8,10 తరగతుల పిల్లలకు ట్యూషన్లు చెబుతుంటేవాడు. పాఠశాలతో బాటు పిల్లలకు శాస్త్రీయ అవగాహనను పెంచే విషయాలు బోధిస్తుండేవాడు. వాటిలో "దయ్యాలు లేవు" అనే విషయం ఒకటి. దయ్యాలంటే భ్రమలు, భ్రాంతులేనని వివరంగా బోధించారు.

అప్పుడు గోవిందరాజులు అనే విద్యార్థి లేచి "మాస్టారూ! రావినూతల, కుద్రవాని పాలెం గ్రామాల మధ్యలో ఒక పెద్ద చెట్టు ఉంది. దాని మీద దయ్యాలు ఉన్నాయి. ఆ దయ్యాలు ఎక్కడివంటే, ఆ చెట్టు దగ్గరలోనే చేలల్లో ఒక బావి ఉంది. అత్తలమీద, మొగుళ్ళ మీద కోపాలొచ్చి చావదల్చుకున్న ఆడవాళ్ళు ఆ బావిలో పడి చచ్చిపోయే వాళ్ళు. వాళ్ళే దయ్యాలుగా మారి ఆ చెట్టు మీదికి చేరారని మా పెద్దవాళ్ళు చెబుతున్నారు. వాటిని చాలా మంది చూశారు. మేం కూడా సినిమా చూసి కుద్రవానిపాలెం వెళ్తుంటే మాకు కూడా కనిపించాయి. శ్రీ ఆంజనేయం, ప్రసన్నాంజనేయం అని పెద్దగా అరుస్తూ పోతుంటే అవి మాయమై పోయాయి. అవి దయ్యాలు కావంటారా? అని అడిగాడు.

"గోవిందరాజులూ! మంచి ప్రశ్న వేశావయ్యా! అవి దయ్యాలు కావు. రాత్రిపూట ఆ ప్రాంతానికి వెళ్ళినప్పుడు, మీరెంత ధైర్యవంతులైనా, దయ్యాలున్నాయనీ, అవి పీడిస్తాయనీ నమ్ముతున్న వాళ్ళు కాబట్టి, ఆ సమయంలో మీ మనస్సు అనుకోకుండా తీవ్రమైన భయాందోళనలకు లోనవుతుంది. అప్పుడు మానసిక జబ్బులైన "భ్రమలు", "భ్రాంతులు" మిమ్ములను తాత్కాలికంగా ఆవహిస్తాయి. వాటికే మీరు దయ్యాలు అని పేరు పెట్టుకున్నారు. ఆంజనేయ నామ స్మరణ చేయగానే మీకు ధైర్యం వచ్చింది. భయాందోళనలు తగ్గుముఖం పట్టాయి. దానితో భ్రమలు, భ్రాంతులు తొలగిపోయాయి. "అంటే దయ్యాలు పారిపోయా యన్నమాట" అని నవ్వాడు మాస్టారు.

"అక్కడ దయ్యాలు లేవని మీరు నిరూపించగలరా?" వెంకట్రావు లేచి అడిగాడు.

"నిరూపిస్తాను. మామూలు రోజుల్లో కాదు. అమావాస్య రోజున, సరేనా?" అన్నాడు మాస్టారు.

"ఎలా?" అడిగాడు వీరయ్య.

"రాబోయే అమావాస్య రోజున నేను ఒక టార్చిలైటు మాత్రం తీసుకొని ఆ చెట్టు క్రింద, దాని దగ్గరలోని బావి గటుటమీద అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక పావుగంట కూర్చొని వస్తాను. టార్చిలైటు ఎందుకంటే, దోవలో చేలల్లో పామూ, గర్రా ఉన్నాయేమో చూసుకోవడానికి. నాకేమీ కాకపోతే దయ్యాలు లేవని నమ్ముతారా?" అని అడిగాడు మాస్టారు.

"మీరు ఆ చెట్టు, బావి దగ్గరకు వెళ్ళినట్లు మాకెలా తెలుస్తుంది?" అని అడిగాడు రామాంజనేయులు.

"ఒక పని చేస్తాను. చెట్టు క్రిందికి చేరగానే ఒకసారి, బావి దగ్గరకు చేరగానే ఒకసారి, టార్చిలైటు మీవైపు ఫోకస్ చేస్తాను. అక్కడ పావుగంట కూర్చున్న తర్వాత ఆ బావిచుట్టూ ఉన్న మొక్కల పూలు కొన్ని కోసుకొని వస్తాను. ఆ పూలమొక్కలు ఆ చుట్టుప్రక్కల ఎక్కడా లేవని మీకు తెలుసుగదా?" అని అడిగాడు మస్టారు.

"అవును. మీరు చేస్తానన్న పని బాగుంది". అన్నాడు శ్రీను.

అమావాస్య వచ్చింది, "విశ్వశాంతి విద్యాకేంద్రంలో చదువుతున్న పిల్లలు రాత్రి విద్యాకేంద్రంలోనే పడుకుంటారు. వారిలో ఒక పదిమంది పిల్లలతో కలిసి రాత్రి 11.30కి కాంతారావు మాస్టారు బయలుదేరాడు. పిల్లలు ఒక అరకిలో మీటరు దూరంలో ఆగారు. మాస్టారు టార్చిలైటు వేసుకుంటూ, దోవచూసుకుంటూ పెద్దచెట్టు దగ్గరకు వచ్చి, టార్చిలైటు పిల్లలవైపు ఫోకస్ చేసి, ఆర్పి, పదినిమిషాలు కూర్చుకున్నాడు. మరలలేచి బయలుదేరి, చేలలో బావి దగ్గరకు వెళ్ళి, పిల్లలకు టార్చిలైట్ ఫోకస్ చేశాడు. అక్కడ కూడా, బావి గట్టుమీద పదినిమిషాలు కూర్చొని, లేచి, టార్చిలైటు వెలుగులో కొన్ని పూలు కోసుకొని తిరిగి పిల్లల దగ్గరకు చేరి, వారికి ఆ పూలు చూపించాడు.

"ఇప్పుడు దయ్యాలు లేవని నమ్ముతారా?"

"నమ్ముతాం". అన్నారు పిల్లలందరూ.

"నిజంగా నమ్మితే, మీలో ఒకరు టార్చిలైటు తీసుకొని, వాటి దగ్గరకుపోయి కూర్చొని రావాలి".

"నేను రెడీ మాస్టారు!" అన్నాడు వెంకట్రావు.

"సరే పోయిరా"! అని చెప్పి టార్చిలైటు ఇచ్చాడు మాస్టారు.

వెంకట్రావు వెళ్ళి, మాస్టారు చేసినట్లే చేసి పూలతో తిరిగివచ్చాడు.

"ఇంకెవరైనా వెళ్ళగలరా?" అడిగాడు మాస్టారు.

రామాంజనేయులు ముందుకు వచ్చాడు.

తర్వాత వీరయ్య, శ్రీను ఇలా 5,6 గురు వెళ్ళి తిరిగి వచ్చారు. ఇదంతా అయ్యేటప్పటికి రాత్రి 3 గంటలయింది. అందరూ తిరిగి వచ్చి పడుకున్నారు. తెల్లవారు జామున "విద్యాకేంద్రం"లోని పిల్లలందరికీ ఈ విషయం తెలిసి వాళ్ళుకూడా "దయ్యాలు లేవని నమ్ముతాము" అన్నారు.

**కొసమెరుపు:**

మరునాడు ఉదయం 9 గంటలకు కుర్రవాని పాలెం నుండి రావినూతల హైస్కూలుకు వచ్చే 6,7 తరగతుల పిల్లలు ఐదారుగురు రోజూ మాదిరిగానే ఆ బావి దగ్గరకు వచ్చి, పూలు కోసి, గట్టుమీద పెట్టి, చేతులు జోడించి "అమ్మలూ! దయ్యాలూ! మీకు దణ్ణం పెడుతున్నాము, మమ్మల్నేం చేయకండి" అని ప్రార్థిస్తున్నారు. ఆదోవన స్కూలుకు వెళుతున్న "విద్యాకేంద్రం" పిల్లలు బావిదగ్గరకు వెళ్ళి, "ఒరేయ్! ఇక్కడ దయ్యాలు లేవురా! అసలు బావిదగ్గరకు వెళ్ళి, "ఒరేయ్! ఇక్కడ దయ్యాలు లేవురా! అసలు దయ్యాలే లేవని మా మాస్టారు నిరూపిచారు. అన్నారు.

"ఎలా?" అని అడిగారు వాళ్ళు.

రాత్రి జరిగిన సంఘటనను వాళ్ళు చిన్న పిల్లలకు వివరించారు. అంతే! ఆ పిల్లలు గట్టు మీద నున్న పూలను క్రిందికి తోసి, కాళ్ళతో తొక్కుతూ "దయ్యాలు లేవు, దయ్యాలు లేవు" అరుస్తూ గంతులేయసాగారు.

**సంఘటన 2:**

2003 జూన్ 25. ఆరోజు అనంతపురం జిల్లా కొత్తకోట గ్రామంలో ఒక వ్యక్తి మరణించాడు. చనిపోవడానికి కొన్ని రోజుల ముందు నుండి "నన్ను ఎవరో తీసుకుపోతున్నారు. చుట్టూ వాళ్ళు అంతా ఉండి మధ్యలో నన్ను కూర్చోబెట్టేవారు. చిన్న పిల్లలు రాళ్ళతో కొట్టేవారు. ఇలా చాలా కాలంగా జరుగుతున్నది" అని ఒకరిద్దరు మిత్రులతో చెప్తుండేవాడు.

ఆ తర్వాత మరుసటినెల అదే తారీఖున అంటే జులై 25న అదే ఇంటిలో అతని తమ్ముడు చనిపోయాడు. దీనితో ఆ గ్రామస్తులు తీవ్రమైన భయానికి లోనయ్యారు. దానికి కారణాన్ని తెలుసుకోవడానికి మంత్రగాళ్ళను ఆశ్రయించారు. వాళ్ళు, ఆ ఇంట్లోనే కాదు, చుట్టుప్రక్కల ఇళ్ళలో కూడా దయ్యాలు తిరుగుతున్నాయనీ, ఆ ఇండ్లను 21 రోజులు ఖాళీగా ఉంచాలనీ, తర్వాత శాంతులు జరిపించి, ఇళ్ళలోకి రావాలనీ చెప్పారు. ఈ వార్త అన్ని పత్రికల్లోను ప్రముఖంగా వచ్చింది. ఆ ప్రాంతంలో పెద్ద అలజడిని కలిగించింది.

జిల్లా వైద్యాధికారి అన్నదమ్ముల మరణాలకు శాస్త్రీయ వివరణ ఇద్దామని తన సిబ్బందితో ఆ గ్రామానికి వెళ్ళారు గానీ ప్రజలు అడిగే ప్రశ్నలకు తట్టుకోలేక వెనుకకు వచ్చారు. స్థానిక జెవివి కార్యకర్త డా॥కృష్ణయ్య జెవివి జిల్లా కమిటీ దృష్టికి పై విషయాన్ని తీసుకువచ్చారు. జిల్లా కమిటీ సూచనతో ఒక సత్యపరిశోధక బృందం ఆ గ్రామానికి వెళ్ళింది. బృంద సభ్యులు గ్రామంలో తిరిగి పరిశీలించారు. ఆ ఇంటిని కూడా పరిశీలించారు. గ్రామంలో ఒక ప్రదర్శన ఇచ్చి మూఢ నమ్మకాల గురించి వివరించారు. "మీరు చెప్పినవన్నీ బాగానే ఉన్నాయిగానీ ఆ ఇంటిలో జూన్, జులై నెలల్లో 25వ తేదీన రాత్రి వేళల్లో మరణాలు సంభవించాయి. మీరు ఆ ఇంటిలో ఆగస్టు 25 రాత్రి పడుకొని ప్రాణాలతో బయటకు వస్తే, దయ్యాలు లేవని మేం నమ్ముతామ"ని ఆ గ్రామస్థులు అడిగారు. జె.వి.వి. బృందం "తప్పకుండా పడుకుంటాం" అని హామీ ఇచ్చి తిరిగి వచ్చింది.

చెప్పిన విధంగానే ఆగస్టు 25న జెవివి బృందం ఆ గ్రామానికి చేరుకున్నది. ఆ బృందంలో ఎస్ఎస్ఖాన్, డా॥ శైలజానాథ్ (తర్వాత మంత్రి అయ్యారు), రాంమోహన్, రవి, రాఘవేంద్రలు ఉన్నారు. "మీరు కేవలం పడుకోవడమే కాదు, అర్ధరాత్రి 12 గంటలకు ఏదైనా మాంసాహారం తింటే, దయ్యాలు తప్పక వస్తాయి" అని ఆ గ్రామస్థులు చెప్పారు. మనవాళ్ళు సరేనన్నారు. అంతే! కోడికూర సిద్ధమైంది. ఆ బృందానికి అందించి, వారు ఆ ఇంటిని శుభ్రం చేసి వెళ్ళిపోయారు. గ్రామస్తులిచ్చిన టార్చిలైట్ సహాయంతో జెవివి బృందంవారు ఆ ఇంటిలో కొంతసేపు గడిపారు.

అర్ధరాత్రి 12 గంటలయింది. సిద్ధంగా ఉంచుకున్న కోడికూరను జెవివి బృంద సభ్యులు తృప్తిగా భోంచేసి, బ్రేవ్‌మని త్రేన్చి, నిద్రకు ఉపక్రమించారు. చక్కగా నిద్రపోయి, ఉదయమే లేచారు. గ్రామంలోని అనేకమంది ఆందోళనతో నిద్రలేని రాత్రి గడిపారు. తెల్లవారి బయటికి వచ్చిన జెవివి సభ్యులను ఆశ్చర్యంతో, ఆనందంతో చూశారు.

ఉదయమే ఊరి వారందరినీ కూర్చోబెట్టి, బృంద సభ్యులు తమ పరిశీలనాంశాలను వివరించారు.

మీ గ్రామంలో గుప్తనిధులున్నాయని ఎప్పటి నుండో పుకార్లు ఉన్నాయి. చనిపోయిన అన్నదమ్ములు రాత్రిళ్ళు గుప్త నిధుల తవ్వకానికి వెళ్ళేవారు. పగలు పనికి వెళ్ళేవారు. దానితో వాళ్ళ ఆరోగ్యం దెబ్బతిన్నది. మరో ప్రక్క, గుప్తనిధుల నావహించిన శక్తులు తమనేవో చేస్తాయని భయం పట్టుకుంది. ముందుగా అన్న ఈ భయానికి లోనయ్యాడు, చివరకు ఆ భయంతోనే మరణించాడు. దానితో తమ్మునిలో కూడా భయం తీవ్రమైంది. ఈ విధంగా ఇద్దరి మరణం ఒకే తేదీన సంభవించింది. మంత్రగాళ్ళు దయ్యాలున్నాయని చెప్పడం పెద్దమోసం. దయ్యాలు లేవు, ఏమీ లేవు" అని వివరించారు.

పై విధంగా పరిస్థితిని వివరించిన జెవివి బృంద సభ్యులు ఆ ఇంటివారిని, చుట్టుప్రక్కలవారిని "నిరభ్యంతరంగా నిశ్చితంగా మీ ఇళ్ళలో ప్రవేశించండనీ, శాంతులేమీ అవసరం లేద"ని చెప్పారు. వారు స్వానుభవంతో, శాస్త్రీయంగా చెప్పిన విషయాలను గ్రామస్థులు అర్థం చేసుకొని, తమ ఇళ్ళలో ప్రవేశించి, నిశ్చితంగా నివసించసాగారు.

సోదరీ సోదరులారా!

ఇలా అనేక సందర్భాలలో సైన్సు కార్యకర్తలు, జనవిజ్ఞాన వేదిక సభ్యులూ దయ్యాలు లేవని నిరపించారు. సైన్సు నిరూపించిన ఈ విషయాన్ని మీరందరూ అర్థం చేసుకొని, దయ్యాలు మానసిక భ్రమలేనని తెలుసుకొని, మూఢనమ్మకాలు లేని జీవితాలను ఆనందమయంగా గడపవలసినదిగా కోరుచున్నాము.

విజ్ఞానాభినందనాలతో...

**జనవిజ్ఞాన వేదిక**

(AIPSN అనుబంధం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటి

9642488205, 9705333305, 9866498189, 9849804467